క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



టై, బెల్టులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ గోపాల్

పరిగి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల కృషి అభినందనీయమని మండల విద్యాధికారి గోపాల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మిట్టకోడూర్ ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన రాజు టై, బెల్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సాయంతో పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతిఒక్కరూ విద్యార్థుల చదువుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎం బుద్ధదేవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉస్మాన్అలీ, మాజీ ఎంపీటీసీ జహంగీర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలకిషన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

ఎస్ఐ విమల

బంట్వారం: పౌర హక్కులను ప్రతిఒక్కరూ గౌరవించాలని, భంగం కలిగిస్తే చర్యలు తప్పవని బంట్వారం ఎస్ఐ విమల హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని మద్వాపూర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పౌర హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఆమె సూచించారు. కులం, మతం, వివక్ష, అంటరానితనం రూపుమాపాలన్నారు. స్వేచ్ఛా, సమానత్వం జీవించే హక్కుపై ఆమె గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాంగోపాల్, మర్పల్లి ఎస్టీ ఆశ్రమ పాఠశాల అధ్యాపకుడు లక్ష్మీనారాయణ, మద్వాపూర్ మాజీ సర్పంచ్ గోవిందరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ కమిటీ సభ్యులకు సన్మానం

కుల్కచర్ల: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తమ్మలి రాంచంద్రయ్య, ఇందిరమ్మ కమిటీ కోఆర్డినేటర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలో మంజూరైన ఇళ్లకు లబ్ధిదారులతో కలిసి నిర్మాణ పనులను ముగ్గుపోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆనందం, జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేశ్, స్థానిక నాయకులు బాల్ రెడ్డి, లింగంగారి రాములు, అంజిలయ్య, భీమయ్య, పాషా, ఆజాం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఐవైసీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా గోవర్ధన్

బంట్వారం: ఇండియన్ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోట్‌పల్లి మండల కో ఆర్డినేటర్‌గా జడల గోవర్ధన్ నియమితులయ్యారు. శనివారం వికారాబాద్‌లో ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సంక్షేమం కోసం పని చేస్తానన్నారు.

ముగిసిన టీఎల్ఎం మేళా

యాలాల: విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టీఎల్ఎం (టీచింగ్ లర్నింగ్ మెటీరియల్) మేళా శనివారంతో ముగిసింది. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంఈఓ రమేశ్ హాజరయ్యారు. మండలంలోని పగిడియాల, కోకట్, అగ్గనూరు, యాలాల క్లస్టర్ పరిధిలోని పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొని టీఎల్ఎంలను ప్రదర్శించారు. లో కాస్ట్, నో కాస్ట్ పద్ధతిలో టీఎల్ఎం తయారీ, అక్షర మాలలు, ఈజీ పద్ధతిలో కూడికలు, తీసివేతలను వివరించడం వంటి వాటిని ప్రదర్శించారు. అనంతరం ఈ మేళాలో పాల్గొన్న ఉపాధ్యాయులకు అభినందన పత్రాలను అందజేశారు. కాంప్లెక్స్ హెచ్ఎంలు మహిపాల్‌రెడ్డి, క్రిష్టయ్య, సిద్రామేశ్వర్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, డీఆర్పీలు ప్రభాకర్‌చారి, పరమేష్, పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత

ధారూరు: మండల కేంద్రంలోని తాహెరాబేగానికి మెరుగైన వైద్యం కోసం కుమారుడు జహంగీర్‌కు శనివారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ రూ.2.50 లక్షల ఎల్ఓసీ అందజేశారు. కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ బాబాఖాన్ సహకారంతో హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మండలంలోని 21 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాన్‌సింగ్ పంపిణీ చేశారు. రూ. 8.69 లక్షల చెక్కులు అందజేశారు.

సవరణకు వేళాయె!

- డబుల్ ఓటర్లుగా నమోదు
- తొలగించని మృతుల ఓటు
- తప్పుల తడకగా మారిన లిస్టు
- జాబితా దిద్దుబాటుకు ప్రభుత్వం చర్యలు



తప్పులు సవరించాలని ఎంపీడీఓ గ్యామాకు వినతిపత్రం అందజేస్తున్న రాజకీయ నేతలు

దోమ: పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఓటరు జాబితా తయారీపై ఈ నెల 28న గురువారం ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. వార్డుల వారీగా కొత్త జాబితాను సిద్ధం చేసి ఆయా కార్యాలయాలకు చేరవేసింది. దీనిని పంచాయతీ కార్యదర్శులు, అధికారులు గ్రామ పంచాయతీలలో ప్రదర్శించారు. వాటిలో ఎక్కువగా మృతుల ఓట్లు, డబుల్ ప్రచురించారు. ఈ చర్యతో రిజర్వేషన్లు మారే అవకాశం ఉందని ఆందోళనలో రాజకీయ నాయకులు ఉన్నారు. దీంతో ప్రభుత్వం పునరాలోచన చేసి తప్పులను సవరించేందుకు దిద్దుబాటు చర్యలకు పూనుకుంది.

మండలంలో 44,185 ఓటర్లు

దోమ మండల వ్యాప్తంగా మొత్తం 36 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 308 వార్డులు ఉన్నాయి. ప్రతి గ్రామ పంచాయతీలో ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఏమైన తప్పులు ఉంటే తెలపాలని ఆయా రాజకీయనాయకులను, పార్టీల అధ్యక్షులను, యువకులను కోరారు. ఈ క్రమంలో శనివారం మండల కేంద్రంలో రాజకీయ వేత్తలతో అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కూడా ఫిర్యాదులు అందాయి. మొత్తం 44,185 ఓటర్లు ఉండగా అందులో 22,056 మంది పురుషులు, 22,129 స్త్రీలు ఉన్నారు. అందులో డబుల్ ఓటర్లు, డెత్ ఓటర్లుగా, ఇతర గ్రామాల వారివీ లిస్టులో ఉన్నాయి. దీంతో ఈ జాబితా తప్పుల తడకగా ఉందని కొందరు విమర్శిస్తున్నారు. వెంటనే వాటిని సరిచేయాలని కోరుతున్నారు.

డెత్, డబుల్ ఎక్కువ

మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో మృతుల పేర్లు, డబుల్ ఎక్కువగా దర్శనమిచ్చాయి. ఒకే కుటుంబానికి చెందినవారు ఒకే వార్డులో ఉండేలా అధికారులు కసరత్తు చేసినప్పటికి అది సాధ్యం కాలేదు. అందుకు భిన్నంగా వేరే వార్డులో పేర్లు నమోదు కావడం దీనికి నిదర్శనం. ఉదాహరణకు ఒక ఇంట్లో పది మంది ఉండగా అందులో ఏడుగురివి వారి వార్డులో ఉంటే, మరో ముగ్గురివి ఇంకో వార్డులో చేర్చారు. అంతేకాకుండా చాలా గ్రామాల్లో ఇతర గ్రామాల ఓటర్ల పేర్లు నమోదయ్యాయని అధికారుల దృష్టికి తెస్తున్నారు. కొందరివి వేర్వేరు వార్డుల్లో రెండేసిగా పేర్లు ఉన్నాయి. ఇంకొందరివి ఇంటి పేరు, భర్త, తండ్రి పేరు తప్పుగా ముద్రించారు. ప్రధానంగా బాస్‌పల్లి, బొంపల్లి, దోమ, దాదాపూర్, గుండాల, కిష్టాపూర్, బుద్లాపూర్‌తో పాటు ఆయా గ్రామాల్లోని ఓటరు జాబితాలో పలు తప్పులు చోటుచేసుకున్నాయి. దీంతో రాజకీయ నాయకులు, యువకులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి తప్పులను సరిచేసి ఫైనల్ లిస్టు విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

తప్పులు ఉన్నాయి



ఓటర్ల ముసాయిదా జాబితాల్లో ఎక్కువగా తప్పులు దొర్లాయి. మండల కేంద్రంలోని ఆరో వార్డులో ఇతర వార్డులకు సబంధించిన దాదాపు 80 మందిని బీఎల్వోలు యాడ్ చేశారు. దాంతో పాటు మరి కొన్ని వార్డుల్లో డెత్, డబుల్ దర్శనమిస్తున్నాయి. అధికారులు తప్పులు లేకుండా చూడాలి.

– రాజిరెడ్డి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు

ఒకే దగ్గర ఉండేలా..



అధికారులు గ్రామ పంచాయతీలలో ప్రదర్శించిన జాబితాలో సవరణలు చేయాలి. ప్రతి వార్డులో డెత్, డబుల్ యాడ్ అయ్యాయి. ఏళ్ల క్రితం మృతుల ఓట్లు కూడా రద్దు చేయలేదు. మరి కొన్ని వార్డుల్లో కుటుంబ సభ్యులందరు ఒకే దగ్గర ఉండేలా సవరించాలి. కొంత మందిని ఇతర వార్డుల్లో చేర్చారు. దీంతో ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు చొరవ చూపి ఫైనల్‌ను విడుదల చేయాలి.

– రాములు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, బొంపల్లి

చర్యలు తీసుకుంటాం



జాబితాలో సవరణలు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. డబుల్, డెత్ పేర్లు వస్తే వాటిని తీసివేయిస్తాం. కుటుంబ సభ్యులను ఒకే వార్డులో ఉండేవిధంగా దృష్టి సారిస్తాం. ఏ గ్రామ పంచాయతీలోనైనా ఓటరు జాబితాలో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సవరిస్తాం.

– గ్యామా, ఎంపీడీఓ, దోమ

ఎస్‌బీఐలో ముసుగు దొంగ!

- గ్రిల్స్, తలుపు గొళ్లెం కట్ చేసి లోనికి వెళ్లిన దుండగుడు
- డబ్బుల చోరీకి విఫల యత్నం
- ఏమీ దొరక్కపోవడంతో తలుపులు మూసి వెళ్లిన వైనం
- ఆధారాలు సేకరించిన పోలీసులు, కేసు నమోదు



క్యాష్ కౌంటర్ గదిలో ముసుగు దొంగ



బ్యాంకులో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

బషీరాబాద్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బషీరాబాద్ బ్రాంచ్‌లో అర్ధరాత్రి ముసుగు దొంగ చొరబడ్డాడు. తీవ్రంగా ప్రయత్నించినా ఏమీ దొరకకపోవడంతో బ్యాంకు తలుపులు మూసి తాపీగా వెళ్లిపోయాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానిక ఎస్ఐ నుమాన్‌అలీ, బ్యాంకు మేనేజర్ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఎప్పటిలాగే విధులు ముగించుకొని ఉద్యోగులు ఇంటికి వెళ్లిపోయారు. శనివారం ఉదయం బ్యాంకు తెరవడానికి వెళ్లిన అటెండర్ నందబాయి గ్రిల్స్, డోర్ గొళ్లెం కోసి ఉండటాన్ని గమనించి మేనేజర్‌కు సమాచారం అందించారు. వెంటనే బ్యాంకుకు చేరుకున్న ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు బ్యాంకులోని సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించారు. ఓ దొంగ అర్ధరాత్రి ఒంటి గంటకు స్వెటర్, ముఖానికి ముసుగు ధరించి లోనికి చొరబడ్డాడు. క్యాష్ కౌంటర్ రూమ్, లాకర్ ముందు గదుల్లో కొద్దిసేపు తచ్చాడాడు. క్యాష్ కౌంటర్‌లోని డెస్కులను తెరిచి చూశాడు. 45 నిమిషాల పాటు బ్యాంకులో కలియతిరిగాడు. బ్యాగుతో చోరీకి వచ్చిన అతని ప్రయత్నం విఫలం కావడంతో రాత్రి 1.45 గంటలకు బ్యాంకు తలుపులు మూసి వెళ్లిపోయాడు. ఘటనా స్థలంలో పోలీసులకు యాక్సా బ్లేడ్ లభించింది. బయట సీసీ కెమెరాలు లేకపోవడం, ముఖానికి ముసుగు వేసుకోవడంతో దొంగ ఎవరనేది తేలలేదు. వికారాబాద్ నుంచి వచ్చిన క్లూస్ టీంకు కూడా ఎలాంటి ఫింగర్ ప్రింట్స్ లభించలేదు. ఇదిలా ఉండగా లాకర్ రూమ్ తెరవక పోవడంవలన ఎలాంటి చోరీ జరగలేదని మేనేజర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సవాల పేరిట కేటుగాళ్ల బురిడీ

- ఆఫర్‌లో గృహోపకరణాలు ఇస్తామంటూ డబ్బు వసూలు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

తాండూరు టౌన్: నవరాత్రి ఉత్సవాల పేరిట కొందరు కేటుగాళ్లు ప్రజలను నమ్మించారు. గృహోపకరణాలు ఇస్తామంటూ డబ్బులు వసూలు చేసి ఉడాయించారు. పోలీసులను ఆశ్రయించిన బాధితులు. ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పాత తాండూరుకు చెందిన మహిళల వద్దకు ఆరుగురు సభ్యులు ఉన్న ముఠా వచ్చింది. కర్నాటక రాష్ట్రం సేడం నుంచి వచ్చామని, గణేశ్ పండగ ఆఫర్లు ఉన్నాయని చెప్పారు. తక్కువ ధరకే ఫ్రిజ్, టీవీ, కూలర్, బీరువా, మిక్సీ, ఫ్యాన్లు తదితర సామగ్రిని ఇస్తామని నమ్మబలికారు. మొదట్లో కొంత నగదు చెల్లించి, మిగతావి వాటిని డెలివరీ చేసిన రోజున ఇవ్వాలని చెప్పారు. దీంతో సుమారు 20 మంది మహిళలు రూ.5 వేల నుంచి రూ.30 వేల వరకు నగదు, యుపీఐల ద్వారా చెల్లించారు. గడువు దాటినా సామగ్రి అందకపోవడంతో ఫోన్ ద్వారా వారిని నిలదీశారు. త్వరలోనే అందజేస్తామని చెప్పిన సదరు వ్యక్తులు.. రెండు రోజుల తర్వాత ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధిత మహిళలు కొందరు పోలీసులను ఆశ్రయించారు. ఇతర అవసరాల కోసం దాచుకున్న డబ్బును వారికి ఇచ్చి మోసపోయామని వాపోయారు. ఎలాగైనా న్యాయం చేయాలని కోరారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపారు.

అధిక ధరకు అమ్మితే చర్యలు తప్పవు



దోమ: అవగాహన కల్పిస్తున్న ప్రభాకర్‌రావు



బంట్వారం: మాట్లాడుతున్న నర్సింలు

వ్యవసాయ అధికారి ప్రభాకర్ రావు

దోమ: ఎరువుల దుకాణదారులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి ఆర్ ప్రభాకర్‌రావు హెచ్చరించారు. శనివారం దోమ మండలంలోని ఆయా ఫెర్టిలైజర్ దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలంలో ఎలాంటి యూరియా కొరత లేదని, సరిపడా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఆగ్రోస్ దుకాణాలలో ఆదివారం కూడా అందుబాటులో ఉంటుందని, రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని ఏ దుకాణంలో కూడా అధిక ధరలకు విక్రయించొద్దని, అమ్మితే ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ 1985 ప్రకారం డీలర్లపై చర్యలు తీసుకుంటామన్నారు.

నానో యూరియా వినియోగించాలి

రైతులందరూ నానో యూరియా వినియోగిస్తే, దిగుబడితో పాటు పర్యావరణాన్ని పరిరక్షించొచ్చని వ్యవసాయ అధికారి ప్రభాకర్ రావు తెలిపారు. మండల కేంద్రంలో నానో యూరియాపై అవగాహన కల్పించారు. గుళికలతో భూమి సారన్ని కొల్పోయి నత్రజని పోషకాలు నశిస్తాయన్నారు. నానో యూరియాతో నత్రజని మూలకం ఆకుల పైనే ఉండి పత్రహరితాన్ని ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఒక ఎకరానికి 500 మిల్లీ లీటర్లు నానో యూరియా మార్కెట్‌లో రూ.225లకు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫెర్టిలైజర్ డీలర్ మురళీ క్రిష్ణ ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

బంట్వారం: సరిపడా ఎరువులను మార్క్‌ఫెడ్ అధికారులు అందుబాటులో ఉంచాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రొంపల్లి నర్సింలు డిమాండ్ చేశారు. శనివారం ఆయన బంట్వారం సహకార సంఘం ఎరువుల గోదాంలో రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి రైతులకు సరిపడా ఎరువులు అందడం లేదన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఇదే సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. ప్రస్తుతం వర్షాలు బాగా కురుస్తున్నందునా పత్తి, మొక్కజొన్న ఇతర పంటలకు యూరియా వాడాల్సి ఉంటుందన్నారు. సహకార సంఘం గోదాంలలో అరకొరగా పంపిణీ చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. యూరియా కోసం ఎప్పుడు వెళ్లినా స్టాక్ లేదనే బోర్డులు దర్శనమిస్తున్నాయని విమర్శించారు.

భయాందోళన వీడాలి

కుల్కచర్ల: నానో యూరియాపై ప్రజలు భయాందోళన వీడాలని మండల వ్యవసాయాధికారి వీరస్వామి అన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణదారుల దగ్గరకు వెళ్లి అక్కడికి వచ్చిన రైతులకు నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. నత్రజని అంతరించకుండ, మొక్కలకు నేరుగా ఖనిజ లవణాలు అందిస్తాయన్నారు. అవి ప్రకృతి పరిరక్షణకు పాటు పడడమే కాకుండా పంటలో అధిక దిగుబడికి అవకాశం కల్పిస్తాయన్నారు. రైతులు కొత్త విషయాలను గ్రహించి వ్యవసాయంలో సాంకేతిక పద్ధతిని అవలంభించాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

• నేడు రవీంద్ర భారతిలో జిల్లా కళాకారుల ప్రదర్శన

బొంరాస్‌పేట: ప్రపంచ జానపద కళా దినోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, టీఆర్‌జేకేఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ముగింపు వేడుకలు నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, కృష్ణయ్య ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన 23 మందితో వీధినాటకం, తోలుబొమ్మలాట ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు కేవీ రమణాచారి, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మామిడి హరికృష్ణ తదితరులు హాజరవుతారని తెలిపారు.

• రేపు సీపీఎస్ ధర్నా

కుల్కచర్ల: సెప్టెంబర్ 1న నిర్వహించనున్న సీపీఎస్ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేందర్ రెడ్డి, బస్వరాజ్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నగరంలోని ఇందిరాపార్క్ వద్ద పీఆర్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాలో పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కుల్కచర్ల మండల పరిధిలోని పీఆర్టీయూ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

• పిచ్చిమొక్కల తొలగింపు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని బోడబండ తండా ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం పిచ్చి మొక్కలను తొలగించారు. కొద్ది రోజులుగా పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు అధికంగా పెరగడంతో విషపురుగులు, పాముల బెడద ఎక్కువయ్యాయన్నారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలత ప్రత్యేక శ్రద్ధ వహించి మందుల పిచికారీ చేయించారు, పెరిగిన పిచ్చి గడ్డిని శుభ్రంచేయించారు. స్థానిక యువజన నాయకులు మల్లేష్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, మాజీ సర్పంచ్ మాణికిబాయి, అంగన్‌వాడీ కార్యాకర్త కవిత పాల్గొన్నారు.

సాగు నీరందించిన ఘనత బీఆర్ఎస్‌దే

పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేశ్‌రెడ్డి

పరిగి: బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి నిరంతరం కృషి చేసిందని.. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు పన్నినా ప్రాజెక్టులు నిర్మించిందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ఆలస్యానికి కారణం కాంగ్రెస్ పెట్టిన కేసులే అని ఆరోపించారు. పాలమూరు రైతులకు సాగు నీరు అందించిన ఘతన బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. రూ.5వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టుకు ఇప్పుడు రూ. 20వేల కోట్ల అంచనాలు సిద్ధం చేసి ప్రజాధనం కొల్లగొట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దండాపూర్ ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తే వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు రెండేళ్లలో సాగు నీరు అందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్దండాపూర్ ప్రాజెక్ట్ టెండర్లను రద్దు చేయడం సరికాదన్నారు. వెంటనే టెండర్లను పునరుద్ధరించి పనులను ప్రారంభించాలని డిమాండ్స్ చేశారు. రైతులకు సకాలంలో యూరియా అందించలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అరవింద్‌రావు, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, మాజీ కోఆప్షన్ సభ్యుడు మీర్ మహ్మద్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వంట గ్యాస్‌పై అదనపు వసూళ్లు

వాహనాన్ని అడ్డుకుని ఆందోళన చేపట్టిన వినియోగదారులు



గ్యాస్ సరఫరా వాహనాన్ని అడ్డుకున్న చిలుముల్ మైల్వార్ గ్రామస్తులు

దుద్యాల్: వంట గ్యాస్ సిలిండర్లను అధిక ధరలకు విక్రయిస్తున్నారని మండల పరిధిలోని చిలుముల్ మైల్వార్ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. వివరాలు.. గ్యాస్ వినియోగదారులు బుక్ చేసుకున్న వారికి బొంరాస్‌లో ఉన్న ఇండియన్‌గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వారంలో ఒక రోజు గ్యాస్ సిలిండర్లు తీసుకువచ్చి ఇస్తుంటారు. సిలిండర్ ధర రూ.922 ఉండగా ఏజెన్సీ వారు మాత్రం రూ.1,020 వసూలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. గతంలో సరఫరా చేసిన సమయంలో రూ.50 అధికంగా తీసుకునే వారని ప్రస్తుతం ఖచ్చితంగా రూ.100 అదనంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. రూ.50 తీసుకోవాలని ప్రాధేయపడినా వినకపోవడంతో ఆగ్రహించిన వినియోగదారులు వాహనం కదలనీయకుండా బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఏజెన్సీ నిర్వాహకుడు అక్కడకు చేరుకుని ధర తగ్గించమని ఎవరికైనా చెప్పుకోండి అన్నారు. ఘటనా స్థలికి చేరుకున్న ఎస్ఐ యాదగిరి గ్రామస్తులతో మాట్లాడారు. ధరను తగ్గించాల్సిందే అనే పట్టుబట్టడంతో చేసేదేమి లేక రూ.950కు ఇస్తామని చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. చివరకు రూ.950 చొప్పున వినియోగదారులకు సిలిండర్లు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలే మేలు



ఫ్రెండ్లీ గణనాథున్ని దర్శించుకున్న హిందూ ఉత్సవ సమితి సభ్యులు

తాండూరు టౌన్: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులను ప్రతిష్ఠించడం శ్రేయస్కరమని హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులు, కోశాధికారి సంతోష్ కుమార్‌లు అన్నారు. శనివారం వారు పర్యావరణ పరిరక్షణకు ఏకో ఫ్రెండ్లీ గణనాథ విగ్రహాన్ని తయారు చేసిన మైక్రో ఆర్టిస్టు మధును అభినందించారు. అనంతరం కాళికాదేవి ఆలయ ఆవరణలో కుమ్మరి మట్టి పాత్రలతో రూపుదిద్దుకున్న వినాయకున్ని దర్శించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆర్టిస్టు మధు.. ఏటా వినూత్న రీతిలో ఎకో ఫ్రెండ్లీ విగ్రహాలను తయారు చేస్తుండటం అభినందనీయమన్నారు. ఈ ఏడాది కుమ్మరి వృత్తి దారులకు అంకితం చేస్తూ మట్టి కూజలు, గ్లాసులు, కుండలు, చిప్పలు, సురాయి, దీపాలు, మట్టి ప్లేట్లతో గణనాథున్ని తయారు చేయడం హర్షణీయమన్నారు.



తాండూరు టౌన్: శాంతినగర్‌లో స్వామివారికి హారతి ఇస్తున్న మహిళలు



అనంతగిరి: పూజలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తదితరులు



కొడంగల్ రూరల్: మట్టి విగ్రహాన్ని ఎంఈఓ రాంరెడ్డికి అందిస్తున్న విద్యార్థులు

కొనసాగుతున్న పూజలు

వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా మండపాల వద్ద నిర్వాహకులు శనివారం అన్నదానం ఏర్పాటు చేశారు.



బంట్వారం: పూజలో తహసీల్దార్ శ్రీనివాస్



తాండూరు రూరల్: సాయిపూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



దోమ: తహసీల్దార్ గోవిందమ్మ, డీటీ నర్సింహులును సన్మానిస్తున్న కాలనీ వాసులు